క్లుప్తంగా

అడిగిన వారందరికీ ఉపాధి



కిష్టాపురంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ హరినాథరెడ్డి

కోడుమూరు: అడిగిన వారందరికీ ఉపాధిహామీ పథకం కింద పనులు చూపించాలని జాతీయ ఉపాధి హామీ పథకం పీడీ హరినాథరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కోడుమూరు మండలంలోని క్రిష్టాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ కూలీలతో మాట్లాడుతూ చేసిన పనికి సరైన వేతనం అందుతుందా, పని చేసిన ప్రాంతాల్లో తాగునీరు, చలువ పందిర్లు వంటి సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వలసలు నివారణ కోసం ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్రతిరోజూ కూలీల సంఖ్య పెరగాలన్నారు. పీడీ వెంట ఏపీఓ రమాదేవి, తదితరులు ఉన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



బొల్లవరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ జబీన్

గడివేముల: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌కు శ్రీకారం చుట్టిందని వైద్యాధికారిణి డాక్టర్ జబీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యులు ఇంటి వద్దకే వచ్చి రోగులకు అవసరమైన వైద్యసేవలు అందిస్తారన్నారు. శుక్రవారం బొల్లవరం గ్రామంలోని సచివాలయం వద్ద పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగులను వారి ఇంటి వద్దకెళ్లి వైద్య సేవలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

23 లోపు పంట నమోదు పూర్తి చేయాలి



ఆర్‌బీకే సిబ్బందితో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి రవిప్రకాష్

కోడుమూరు: ఈ నెల 23 లోపు రబీ సీజన్‌లో సాగుచేసిన పంటల నమోదును పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి రవి ప్రకాష్ ఆర్‌బీకే సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన లద్దగిరిలోని ఆర్‌బీకే సెంటర్‌ను తనిఖీ చేశారు. ఎంపీఈఓలు పొలాల్లోకి వెళ్లి రైతులను సందర్శించి పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రబీ సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయాలకు వచ్చే చీడపీడలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు మండల వ్యవసాయాధికారి వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు భారతీ, హిమసుందరి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత నంద్యాల జట్టు



విజేత జట్టుకు ప్రథమ బహుమతి అందజేస్తున్న దాత

గడివేముల: బిలకలగూడూరు గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో మొత్తం 22 జట్లు పాల్గొన్నాయి. ఇందులో ఫైనల్‌లో నంద్యాల ఫ్రెండ్స్ లెవెన్ జట్టు విజేతగా నిలవడంతో మొదటి బహుమతిగా రూ. 12 నగదును సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి అందించారు. రెండో స్థానంలో నిలిచిన గడివేముల మండలం అల్లగడ్డ టీంకు, రూ.8వేలు, మూడో స్థానంలో నిలిచిన బిలకలగూడూరు టీంకు రూ.5వేల నగదు బహుమతులను అందించారు.

నేడు విద్యుత్ కోతలు

గూడూరు రూరల్: కోడుమూరు నియోజకవర్గంలో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ జేసన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గూడూరు, సి.బెళగల్, కోడుమూరు మండలాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్లలో ఫీడర్లకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. దీంతో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఆయా మండలాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు, వ్యాపారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మొక్కజొన్నపై మక్కువ!

- మండలంలో పెరుగుతున్న సాగు
- గత ఏడాది కంటే ఈసారి రబీలో 50 శాతం అధికం
- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- ఆసక్తి చూపుతున్న రైతులు



బస్తిపాడులో సాగు చేసిన మొక్కజొన్న

కల్లూరు: మొక్కజొన్న సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో మంచి ధర లభిస్తుండటంతో లాభదాయక పంటగా మారింది. దీంతో చాలా మంది ఈ పంట వైపు మొగ్గుచూపుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా కల్లూరు మండలంలో ఈసారి మొక్క జొన్న సాగు భారీగా పెరిగింది. మండలంలో రబీ సీజన్ కింద మొత్తం 6,367 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. ఇందులో అత్యధికంగా 2,767 ఎకరాల్లో మొక్కజొన్న సాగు కావడం విశేషం. గతేడాది 1,350 ఎకరాల్లో ఈ పంట వేశారు. మంచి లాభాలు రావడంతో ఈ సారి మొక్కజొన్న సాగు విస్తీర్ణం రెట్టింపు అయింది.ఎక్కువగా బోరుబావులు, కాలువల కింద రైతులు ఈ మొక్కజొన్న వేశారు.

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం

మిగతా పంటలతో పోల్చితే మొక్క జొన్న సాగుకు పెట్టుబడి ఖర్చు చాలా తక్కువ. రైతులకు శ్రమ కూడా తక్కువే. దీనికి తోడు మార్కెట్‌లో క్వింటం మొక్కజొన్న రూ. 2000 పలుకుతోంది. ఎకరా సాగుకు విత్తనం నుంచి పంట కోత వరకు రూ. 25 వేల వరకు ఖర్చు అవుతుంది. దిగుబడి ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు వస్తుంది. ప్రస్తుత ధరతో విక్రయించుకున్నా పెట్టుబడి ఖర్చులు పోయి ఎకరాపై రూ. 35 వేల నుంచి 55 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు.

కళకళలాడుతున్న పైర్లు

ఈ ఏడాది మండలంలో అత్యధికంగా మొక్కజొన్న, వేరు శనగ, పప్పు శనగ, జొన్న పంటలు సాగయ్యాయి. వాతావరణం అనుకూలించడంతో పాటు గతంలో మాదిరిగా తెగుళ్ల బెడద లేకపోవడంతో పంటలు కళకళలాడుతున్నాయి. దీంతో ఆయా పంటలు సాగు చేసిన రైతులు దిగుబడులపై భారీగా ఆశలు పెంచుకున్నారు.

14 ఎకరాల్లో మొక్కజొన్న వేశా



మొక్కజొన్న పంటకు మార్కెట్‌లో ధర బాగుంది. దీంతో 14 ఎకరాల్లో ఈ పంటను సాగు చేశాను. ఎకరాకు పెట్టుబడి విత్తనాలు, ఎరువులు, మందులకు అన్ని కలుపుకుని రూ. 20 వేలు ఖర్చు అవుతుంది. ఎకరాకు కనీసం 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఈసారి పంట బాగా ఉండటంతో మరింత దిగుబడి పెరగవచ్చు.

– నారాయణరెడ్డి, రెమదూరు, కల్లూరు మండలం

పెరిగిన మొక్కజొన్న సాగు



తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు వస్తుండటంతో మండలంలో ఈ సారి మొక్కజొన్నను అత్యధికంగా సాగు చేశారు. అయితే, మొక్కజొన్న పంటలో విత్తన శుద్ధి తప్పనిసరి. సకాలంలో కాండం తొలుచూ పురుగు, కత్తెర పురుగు నివారణకు సస్యరక్షణలు చేపట్టాలి. దీని వల్ల పంట దిగుబడులు పెరగడానికి అవకాశం ఉంటుంది.

– ఏఓ. శ్రీనివాసరెడ్డి, కల్లూరు

కొత్త మెనూ అమలు చేయండి



భోజనం రుచి చూస్తున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం కొత్త మెనూను పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్‌లోని రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్న సంకల్పంతో మెనూను మరింత మెరుగుపరించిందన్నారు. ఇది పూర్తి స్థాయిలో అమలయ్యేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆహారపదార్థాలు రుచికరంగా ఉండాలని భోజన నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. ఎంపీడీఓ వెంట గ్రామ సచివాలయ సంక్షేమ సహాయకులు బాబురావు, పాఠశాల హెచ్‌ఎం కిషోర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు ఉద్యమిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైకే విశ్వనాథ్ మాదిగ

కర్నూలు (న్యూటౌన్): ఎస్సీ వర్గీకరణే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తామని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే విశ్వనాథ్ మాదిగ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లాల నేతల సమావేశం స్థానిక ఎంపీపీ హాల్‌లో నిర్వహించారు. ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త గూడాల ఈశ్వరయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ , వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు, తెల్లరేషన్ కార్డుదారులకు 4 కేజీల నుంచి 5 కేజీల బియ్యం, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు సాధించిన ఘనత మంద కృష్ణ మాదిగకే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎంఎస్‌పీ కీలక పాత్ర పోషించనున్నట్లు చెప్పారు. 2024లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రకుల పేదలందరి సహకారంతో రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తామన్నారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ సుభాష్‌చంద్ర, కో కన్వీనర్ వెంకటేశ్వర్లు, నంద్యాల జిల్లా కన్వీనర్ కోళ్ల కల్యాణ్, కో కన్వీనర్ వెంకట సుబ్బన్న, కోటా ప్రభాకర్, ఎంఎస్‌ఎఫ్ జాతీయ నాయకులు బుచ్చర్ల నరసింహులు, చిలకము రాబిన్‌సన్ రాజు, రాష్ట్ర అధ్యక్షుడు బెనర్జీ మాదిగ, లాయర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవికాంత్, చంద్రుడు, వీరన్న, ఎంఎస్పీ బుడగ సంఘం జాతీయ నాయకులు తాటికొండ నారాయణ, ఎంఈఎఫ్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు శ్రీరాములు, ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ ఆశపోగు పరమేష్, నగర నాయకులు పాముల కుమార్, చందు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



ప్యాలకుర్తిలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ హౌసింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం ప్యాలకుర్తి గ్రామంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు మెరుగైన సేవలను అందిస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఫారుఖ్, మాజీ ఎంపీటీసీ సలీం తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



వెంకాయపల్లె అంగన్‌వాడీలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ

కర్నూలు (న్యూటౌన్): ఆరోగ్య పరిరక్షణకు గర్భిణులు, బాలింతలు రెగ్యులర్‌గా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ కేఎల్‌ఆర్‌కే కుమారి అన్నారు. శుక్రవారం కర్నూలు మండలం వెంకాయపల్లె, నందనపల్లె, గార్గేయపురం అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రక్తహీనత ఉన్న గర్భిణులతో ఆమె మాట్లాడారు. తీసుకునే ఆహారంలో పాలు, పండ్లు, గుడ్లు, మాంసం, చేపలు, కూరగాయలు ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే తరచుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగు

ఆడపిల్లను బాగా చదివించుకుంటే ఇంటికి వెలుగు అవుతందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జమీలాబీ అన్నారు. శుక్రవారం కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలోని వసంతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అందులో భాగంగానే దిశ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. దీంతో పాటు విద్యా హక్కు చట్టం 2005, బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంపత్‌కుమార్, ఉపాధ్యాయ రాష్ట్ర నాయకులు ప్రకాశ్‌రావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని గ్రామ సచివాలయాల్లో నూతనంగా ప్రారంభించిన ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. మంగళవారం ఆయన సి.బెళగల్ - 1 గ్రామ సచివాలయాన్ని సందర్శించి ఆధార్ సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని సి.బెళగల్ –1 గ్రామ సచివాలయంలో చిన్నారులకు ఉచితంగా ఆధార్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇకపై మండల ప్రజలు అన్ని రకాల ఆధార్ సేవలను సచివాలయాల్లో పొందవచ్చునని చెప్పారు.

సచివాలయ సేవలు విస్తృతం

గూడూరు రూరల్: ప్రభుత్వం నెలకొల్పిన గ్రామ/వార్డు సచివాలయల ద్వారా సేవలను విస్తృతం చేసి ప్రజలకు సక్రమంగా అందించాలని ఎంపీడీఓ మాధవీలత పేర్కొన్నారు. మల్లాపురంలోని సచివాలయాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఇది వరకులాగా ప్రజలు మండల కేంద్రాలకు రాకుండా సొంత గ్రామాల్లోనే సేవలు పొందుతున్నారన్నారు.

విద్యార్థినికి అభినందన

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ రెసిడెన్సియల్ బాలికల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని జి. రామలక్ష్మి సమ్మేటివ్ పరీక్షల్లో 600కు 571 మార్కులు సాధించింది. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థిని డీఈఓ అనురాధ , ఎంఈఓ కోటయ్య శుక్రవారం స్కూల్ వద్ద అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయమ్మ, సీఆర్‌పీ పాల్గొన్నారు.

విద్యుత్ టారీఫ్‌పై కొనసాగిన సలహాల స్వీకరణ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ టారిఫ్‌పై ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ) చేపట్టిన విచారణ శుక్రవారం కూడా కొనసాగింది. విశాఖపట్నం నుంచి చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్‌పై సమగ్ర ఆదాయ, కాస్ట్, సబ్సిడీ సర్చార్జీలు, ఆవశ్యకత, టారీఫ్ ప్రతిపాదనలపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలు, విన్నపాలు స్వీకరించారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు, కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి పాల్గొన్నారు. శనివారం కూడా సలహాలు, అభ్యంతరాలు, సూచనలు సేకరణ ఉంటుందని, ఏపీ ఈఆర్‌సీ వెబ్‌సైట్ / మెయిల్‌లో ముందుగా రిజిస్టర్ చేసుకున్న వారు ఆన్‌లైన్ ద్వారా పాల్గొనేందుకు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

పకడ్బందీగా భూముల రీ సర్వే



రెవెన్యూ అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్

- రెవెన్యూ అధికారులకు ఆర్డీఓ ఆదేశం

కర్నూలు (న్యూటౌన్): మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సుంకేసుల నుంచి గార్గేయపురం వరకు రెవెన్యూ గ్రామాల్లో 82,632 ఎకరాల భూముల రీ సర్వే నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ భూములకు సంబంధించి రీ సర్వే చేపట్టిందని, అందుకు రైతులందరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో సర్వే చేయకముందే రైతులకు ఆయా గ్రామాల్లో దండోరా వేయించి సమాచారం చేరవేయాలని సూచించారు. మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూముల రీ సర్వేతో రైతుల మధ్య నెలకొన్న భూ వివాదాలు పూర్తిగా తొలగిపోతాయని అన్నారు. కార్యక్రమంలో పీఓఎల్ఆర్ డీటీ శారద, సీనియర్ అసిస్టెంట్ జగదీష్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

గడివేముల: ఆంధ్రప్రగతి రాయలసీయ గ్రామీణ బ్యాంకు వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తోందని బ్యాంకు గడివేముల శాఖ చీఫ్ మేనేజర్ వర్గిన్‌జాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం గడివేములలోని బీసీ కాలనీలో ఏపీజీబీ ఆధ్వర్యంలో ఆర్థిక, సాంకేతిక, అక్షరాస్యత సంబంధ అంశాలపై కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు అందిస్తున్న పొదుపు పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్ సేవలను వివరించారు. ఏపీజీబీలో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విష్ణుతేజనాయుడు, క్యాషియర్ మనోజ్ ప్రజలకు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు



శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం: ఈనెల 22వ తేదీ జరిగే కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అయన పాణ్యం మండల పరిధిలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలన్నారు. వెంట హాల్ టికెట్‌తో పాటు ఏదైన ఒరిజినల్ ఆధార్ కార్డు తెచ్చుకోవాలన్నారు. నంద్యాల పట్టణంలో 28 పరీక్ష కేంద్రాలు పాణ్యంలో ఆర్‌జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో మరో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల వద్ద మాల్ ప్రాక్టిస్, కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 10గంటల నుంచి ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు వెంట ఎలక్ట్రానిక్ వస్తువులు తెచ్చుకోరాదన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేశ్వరరెడ్డి, ఎస్‌బీ సీఐ దస్తగిరిబాబు, రీజినల్ కో–ఆర్డినేటర్ ఆశోక్, పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలులో నిర్లక్ష్యం చేయొద్దు

కర్నూలు (న్యూటౌన్): ఇంటి పన్నుల వసూలులో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం చేయొద్దని కర్నూలు మండల ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు మండల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు త్వరితగతిన వసూలు చేయాలని ఆదేశించారు.అలాగే రోగాలు ప్రబలకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల సమ్మెను విజయవంతం చేద్దాం

కర్నూలు(అగ్రికల్చర్): ఈనెల 30, 31 తేదీల్లో చేపట్టే బ్యాంకుల సమ్మెను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ జిల్లా కన్వీనర్ నాగరాజు కోరారు. శుక్రవారం సాయంత్రం రెండు రోజుల సమ్మెను విజయవంతం చేయడంపై గాయత్రి ఎస్టేట్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. బ్యాంకు యూనియన్ల డిమాండ్లను కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందని, ఇందువల్లనే సమ్మెకు వెళ్లక తప్పడం లేదన్నారు. బ్యాంకింగ్ రంగంలో వెంటనే ఐదు రోజుల పనిదినాలను అమలు చేయాలని, వేతన సవరణకు అనుగుణంగా పెన్షన్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. అన్ని కేడర్లలో అవసరాన్ని బట్టి నియామకాలను చేపట్టాలని కోరారు. బ్యాంకుల సమ్మెలో కో ఆపరేటివ్, గ్రామీణ బ్యాంకుల మినహా అన్ని బ్యాంక్ యూనియన్లు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, ఏఐబీఈఏ నాయకురాలు రోజారమణి పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



గడివేముల సొసైటీలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ

గడివేముల: ఎరువులు, రసాయన మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని దుకాణాదారులను వ్యవసాయ శాఖ ఏఓ హేమసుందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలకేంద్రం గడివేములలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎరువులు, మందులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు విక్రయించరాదన్నారు. అలాగే ధరలకు సంబంధించిన బోర్డును దుకాణాల ముందు ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు ఆయన వ్యవసాయ సహకార సంఘం సొసైటీలో కూడా తనిఖీలు చేశారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు





కర్నూలు గీతాముఖర్జీనగర్, గూడూరు 20వ వార్డులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధి బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

- ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా జగనన్న పాలన
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు/కర్నూలు (న్యూటౌన్): మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో గడప గడపకు సంక్షేమ పథకాలు అందించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శుక్రవారం ఉదయం గూడూరు పట్టణంలోని 20 వ వార్డు కోట వీధిలో, సాయంత్రం కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 38వ వార్డు గీతాముఖర్జీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను, ఇప్పటి వరకు చేకూర్చిన లబ్ధిని ప్రజలకు వివరించారు. అలాగే వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వ సేవలు పొందేందుకు ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదని స్థానికంగానే సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. అలాగే ఇంటికే వచ్చి సంక్షేమ ఫలాలు అందజేసేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటి వరకు 98 శాతం అమలు చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వివిధ రూపాల్లో ఎంతో మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి పట్టం కట్టాలని కోరారు. కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో జరిగిన కార్యక్రమంలో 38వ వార్డు కార్పొరేటర్ గిప్సన్, ఎంపీటీసీ హనుమంత, సచివాలయ కన్వీనర్లు, గూడూరులో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, బోయ లక్ష్మన్న, సచివాలయాల కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు, వైఎస్సార్సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జె.ఆబేలు,కౌన్సిలర్లు కలాం, ఖలీల్,దాస్, కుమార్, విజయుడు, నాయకులు పాల్గొన్నారు.

ఓర్వలేకే ప్రతిపక్షాల విమర్శలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షపార్టీలు విమర్శలు చేస్తున్నాయని ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన అభివృద్ధి, మేలును చూపించి ప్రజలకు ఓట్లు అడుగుతామన్నారు. శుక్రవారం ఆయన గూడూరు పట్టణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతి పక్షాలు ఎల్లో మీడియాతో కలిసి సీఎంపై బురద జల్లుతున్నాయని విమర్శించారు. ఇంటింటికీ వెళ్లి సేవలందిస్తున్న వలంటరీ వ్యవస్థను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, సచివాలయాల కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.